క్లుప్తంగా

చంద్రయాన్ విజయవంతంపై శివాలయంలో ప్రత్యేక పూజలు

నందిగామ: చంద్రయాన్ -3 విజయవంతమైన నేపథ్యంలో పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పలువురు బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. భవిష్యత్తులో ఆదిత్య ఎల్ 1 కూడా విజయవంతం కావాలని కోరుతూ పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయానికి కంప్యూటర్ల బహూకరణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ ఆలయానికి శుక్రవారం మండలంలోని అనిగండ్లపాడు గ్రామ కెనరా బ్యాంక్ ప్రతినిధులు రూ.2 లక్షల విలువ చేసే కంప్యూటర్లను ఆలయ ఈఓ రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు బ్యాంక్ అధికారులు, సిబ్బందిని అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

జగనన్న పాలనలో విద్యకు బంగారు భవిష్యత్తు

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో విద్యకు బంగారు భవిష్యత్తు ఏర్పడిందని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న 12వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల పరిషత్ నుంచి రూ.8 లక్షలు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నిధులతో పూర్తి చేశారు. ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను కూడా అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, ఎంపీటీసీ సభ్యులు కాకాని స్రవంతి, చాట్ల సుశీల, మండల పరిషత్ ఏఓ సిద్ధారెడ్డి, పీఆర్ ఏఈ సుందరరామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నేడు మూడు గంటల పాటు విద్యుత్ కోత

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం మూడు గంటల పాటు విద్యుత్ కోత విధిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఆయా పరిధిలోని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

రైతులకు బోనస్ పంపిణీ

కొత్తగూడెం(మైలవరం): మైలవరం మండలం కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సహాయ సహకార సంఘంలో 250 మంది పాల రైతులకు రూ.2078.60 ధర వ్యత్యాసాన్ని బోనస్ కింద శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుల్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరు రామిరెడ్డి మాట్లాడుతూ రైతులు అధికంగా పాలు పోసి బోనస్ పొందాలన్నారు. ఉచిత క్షీర బంధు, గడ్డి కణుపులు, కల్యాణమస్తు పథకాలను పాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ఏప్రిల్ నుంచి జూలై వరకు ఎక్కువగా పాలు పోసిన పల్లెపోగు నాగేశుకు రూ.19,985, భీమవరపు ముత్తారెడ్డికి రూ.8,876, గరికపాటి మరియదాసుకు రూ.7,878 బోనస్ లభించింది. కార్యక్రమంలో కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అప్పిడి సాంబిరెడ్డి, సూపర్‌వైజర్‌లు, పాలకవర్గ సభ్యులు, వేతన కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీకి చెందిన నేమాల భవాని, శ్రీను భార్యాభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు కాగా చిన్న కుమార్తెకు మూడేళ్ల క్రితం గుంటూరుకు చెందిన రాఘవేంద్రరాజుకు ఇచ్చి వివాహం జరిపించారు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా ఆమె పుట్టింటికి వచ్చేసింది. ఆమె నివాసం ఉండే బ్లాక్‌లో ఉండే అజయ్, అతని భార్యతో పరిచయం అయింది. 24వ తేదీ సాయంత్రం 8 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన ఆమె కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ఆరా తీయగా అజయ్ కూడా కనిపించడం లేదు. దీంతో తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

28న సీజ్ చేసిన వాహనాల వేలం

మైలవరం: మైలవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన రెండు వాహనాలను ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ప్రాంగణంలో వేలం వేయనున్నట్టు ఎస్ఈబీ సీఐ గిరిజ సత్యకుమారి శుక్రవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు పాడుకున్న నగదుకు అదనంగా 18 శాతం జీఎస్టీ కట్టవలసి ఉంటుందన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం

- రెండు, మూడు నెలల్లో పూర్తి స్థాయిలో కార్యాలయాలు
- 30 ఏళ్లలో టీడీపీ చేసిందేమీ లేదు
- మండల మార్పును ప్రతి ఒక్కరూ స్వాగతించాలి
- కార్యాలయాల ప్రారంభంలో ఎమ్మెల్సీ అరుణకుమార్



జుజ్జూరులో ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

జుజ్జూరు(వీరులపాడు): ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నెరవేరుస్తున్నామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. జుజ్జూరులో కొత్తగా ఏర్పాటు చేసిన మండల ప్రభుత్వ కార్యాలయాలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అరుణకుమార్ మాట్లాడుతూ రెండు, మూడు నెలల్లో అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాలు జుజ్జూరు గ్రామంలో ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యేగా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జుజ్జూరుతో పాటు మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మూడు దశాబ్దాలుగా టీడీపీ జుజ్జూరు గ్రామానికి చేసిందేమీ లేదని అరుణకుమార్ దుయ్యబట్టారు. మంచి చేసేందుకు మేం తాపత్రయపడుతుంటే చేస్తున్న మంచిని అడ్డుకునేందుకు టీడీపీ శతవిధాలా కుటిల యత్నాలు చేస్తోందని మండిపడ్డారు. ప్రతిపక్షాలు అభివృద్ధిని కోరుతూ అధికార పక్షంపై పోరాడాలని కానీ నందిగామలో మాత్రం ప్రతిపక్ష పార్టీ భిన్నంగా వ్యవహరిస్తూ న్యాయ స్థానాలను ఆశ్రయించి మరీ అభివృద్ధిని అడ్డుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఒక గ్రామం ఎక్కువ మరోటి తక్కువ అనే భేదాలు లేవని నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు సమానమేనని అరుణకుమార్ తెలిపారు. ప్రజా సౌకర్యార్థమే మండల కేంద్రాన్ని మార్చామనే విషయాన్ని గమనించాలని కోరారు. ప్రజా నాయకుడు వట్టికొండ చంద్రమోహన్ గత ఎన్నికల్లో తమకు అండగా నిలిచారని మండల కేంద్ర మార్పులో కూడా అండగా ఉండాలని ఆకాంక్షించారు. అన్ని గ్రామాల ప్రజలు పెద్ద మనసుతో మండల కేంద్ర మార్పును స్వాగతించాలని ఆయన కోరారు. వీరులపాడు మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మార్చడానికి కృషి చేసిన ఎమ్మెల్సీ అరుణకుమార్‌ను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ షేక్ నాగుల్ మీరా, ఎంపీటీసీ సభ్యురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

-మూడున్నర దశాబ్దాల్లో చేయలేని మండల మార్పును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్‌లు మూడున్నరేళ్లలో చేసి చూపించారని ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు పేర్కొన్నారు.

జగనన్న పాలవెల్లువతో మహిళల ఆర్థికాభివృద్ధి

ఎంపీడీఓ బాలశంకరరావు



గండేపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలశంకరరావు

గండేపల్లి(కంచికచర్ల): జగనన్న పాలవెల్లువతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతున్నారని ఎంపీడీఓ కె.బాలశంకరరావు పేర్కొన్నారు. గండేపల్లిలో శుక్రవారం జగనన్న పాలవెల్లువ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఏర్పాటుచేసి పాలు సేకరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కువ మోతాదు పాలు ఇచ్చే ముర్రా జాతి గేదెలతో పాటు ఇతర మేలు జాతి గేదెలను లబ్ధిదారులే కొనుగోలు చేస్తారన్నారు. జగనన్న పాలవెల్లువకు పాలు పోసే మహిళా రైతుల పశుగణాభివృద్ధికి రైతుభరోసా కేంద్రాల ద్వారా పశుగ్రాస విత్తనాలు, దాణామృతం అందిస్తారన్నారు. పశుగ్రాసాన్ని ముక్కలు చేసే చాఫ్‌కట్టర్‌ను ప్రభుత్వం 40 శాతం రాయితీతో పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. మండలంలోని 24మంది లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 24లక్షల విలువైన పాడి గేదెలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచి బొక్కా రవికుమార్, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు వెంకట్రావు, వెటర్నరీ డాక్టర్లు కొండూరు విజయ విశ్వనాథ్, ఎ.నగేష్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ చోడగిరి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జుజ్జూరుకు తరలివచ్చిన అధికారులు



జుజ్జూరులో బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆశయ్యనాయక్

జుజ్జూరు(వీరులపాడు): వీరులపాడు నుంచి మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మారుస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయటంతో శుక్రవారం మండల అధికారులు గ్రామానికి వచ్చారు. దీంతో గ్రామస్తులు, ఆయా పార్టీల నాయకులు స్వాగతం పలికారు. వేద పండితులు మంత్రోచ్ఛరణలతో అధికారులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని జెల్లి ఏసోబు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాల్లో తహసీల్దార్ ఆశయ్య నాయక్, ఎంపీడీవో అరుంధతీ దేవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, ఎంపీటీసీ సభ్యురాలు తమ్మిశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



స్కీం ఫిల్టర్ బెడ్‌లను పరిశీలిస్తున్న నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామటౌన్): తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం రామన్నపేట గ్రామంలోని పీడబ్ల్యూస్ స్కీం ఫిల్టర్ బెడ్‌లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ పంచాయతీ పర్యవేక్షణ లోపంతో తాగునీటికి ప్రజలు కొంత ఇబ్బందులు పడ్డారని భవిష్యత్తులో ఇటువంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్కీం ఫిల్టర్ బెడ్‌లను పూర్తి స్థాయిలో ఆధునీకరించటంతో పాటు వాటర్ పంపు క్లీనింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. స్కీం మరమ్మతు పనులు చేస్తున్నంత కాలం వాటర్ ట్యాంకర్లతో ప్రజలకు తాగునీటిని సరఫరా చేశామని గుర్తు చేశారు. మరమ్మతులు తుది దశకు చేరుకున్నాయని సాధ్యమైనంత వరకు శని, ఆదివారాల నుంచి స్కీం ద్వారా గ్రామ ప్రజలకు తాగునీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, ఆళ్ల ప్రభు, ఆళ్ల శ్రీను, కర్ల సురేష్, బుగ్గినేని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ చిరస్మరణీయుడు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): బీసీలకు రిజర్వేషన్లు కల్పించటంలో విశేష కృషి చేసిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బీపీ మండల్) చిరస్మరణీయుడని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు అన్నారు. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకుని అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాధరపురంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాల సర్వీస్‌లో 27 శాతం రిజర్వేషన్ కల్పించిన మహానుభావుడు బీపీ మండల్ అన్నారు. దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీల కోసం 11 రకాల జీవన ప్రమాణాలను కొలమానంగా తీసుకుని సుమారు మూడు వేలకుపైగా కులాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికను అందించిన వ్యక్తి బీపీ మండల్ అన్నారు. దానిని అమలు చేసేందుకు ఆయన చేసిన ప్రయత్నాల్లో అనేక అవరోధాలు కలిగాయని పేర్కొన్నారు. చివరికి కేంద్ర, రాష్ట్ర విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు సాధించడానికి మూలకారకుడు బీపీ మండల్ అని వివరించారు. బీసీల అభ్యున్నతికి విలువైన సూచనలు చేసిన బీపీ మండల్ దేశంలోని బీసీలందరి మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మాదల తిరుపతిరావు, ఎస్వీ యశోద, అంకాని నాగరాజు, పిచ్చుక లింగారావు, టి.పూర్ణయ్య, అమృత, ఎ.పార్వతి, టి.ప్రమీల, జి.రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా పేదలను ఆదుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్పొరేట్ సంస్థలు సోషల్ రెస్పాన్సిబులిటీ (సామాజిక బాధ్యత) కింద ఇబ్బందుల్లో ఉన్న పేదవారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని సెర్ప్, ఏపీ సీసీఎల్ఏ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ పిలుపునిచ్చారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరద నీరు ఇళ్లల్లోకి చేరి ఇబ్బందులు పడుతున్న విజయవాడ రూరల్ మండలం రామరాజ్యనగర్ ఎగువ, దిగువ కట్టకు చెందిన నివాసితులకు ఆయన శుక్రవారం నిత్యావసర సరుకులు అందచేశారు. నెస్లే ఇండియా, జేసీఐ ఇండియా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆపన్న హస్తం అందించటంలో స్వచ్ఛంద సంస్థలతో పాటు కార్పొరేట్ సంస్థలు కూడా పాల్గొనాలని సూచించారు.

నెస్లే ఇండియా కార్పొరేట్ అఫైర్స్ మేనేజర్ వసీం అహ్మద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పేదలకు సాయం అందించడంలోను, విపత్తుల సమయాల్లో వారి అవసరాలను తీర్చడంలోను సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. నెస్లే బృందం, జేసీఐ ఇండియా ఫౌండేషన్ డైరెక్టర్ ఎన్‌టీ హర్షవర్ధన్‌రెడ్డి, జేసీఐ విజయవాడ ఇంపాక్ట్ శాఖ అధ్యక్షురాలు బి.స్వాతి, డైరెక్టర్ లక్కం రవీంద్ర రెడ్డి, సభ్యులు విష్ణురాజు, మహేష్‌బాబు, పల్లా నాగరాజు, దీప్తి, గణేష్‌బాబు, వర్షిత, శివ, సుబ్రహ్మణ్యేశ్వరరావు, పంచాయితీ సెక్రటరీ లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వెండి మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద సామూహిక కుంకుమార్చనలో మహిళలు

మహాలక్ష్మీ నమోస్తుతే..

- భక్తి శ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

నందిగామ: మహాలక్ష్మీ నమోస్తుతే అంటూ భక్తజనం లక్ష్మీ స్వరూపమైన వరలక్ష్మిని స్తుతించారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో అమ్మవారి ఆలయాల్లో భక్తజన సందడి కనిపించింది. పట్టణంలోని మరిడి మహాలక్ష్మమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో సుక శ్యామలాంబకు ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీపురంలోని వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారిని వరలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబారుపేటలో సత్యమ్మ ఆలయంలో విశేష పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మీల వ్రతాలు చేసుకున్నారు. పట్టణ శివారుల్లోని పల్లగిరి గట్టుపై త్రిశక్తి పీఠంలో సామూహిక కుంకుమార్చనలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

పలు ఆలయాల్లో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

జగ్గయ్యపేటఅర్బన్: శ్రావణ మాస మహోత్సవాలలో భాగంగా పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో రెండో శుక్రవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్థానిక అద్దాల బజారులో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం, నకాశిబజారులో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయం, అయ్యప్పనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలోని అష్టలక్ష్మి సహిత వైభవలక్ష్మి తదితర ఆలయాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వెండి దేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రైవేటు ఇంప్రూవ్‌మెంటు కమిటీ సభ్యులు, దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్పస్వామి ఆలయంలో కమిటీ సభ్యులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రావణ శోభ

పెనుగంచిప్రోలు: శ్రావణమాసం, రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయ ప్రచార రథంలో మండలంలోని గ్రామ దేవతలకు ఊరేగింపుగా వెళ్లి శ్రావణ పట్టీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు దంపతులు, ధర్మకర్తలు కోలా రామారావు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. అమ్మవారిని పోలీస్ బందోబస్తు మధ్య ప్రత్యేకంగా వజ్రాలు పొదిగిన కిరీటంతో అలంకరించారు. నందిగామ ఏసీపీ జనార్ధన్ నాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు.



కంచికచర్ల మహాలక్ష్మీదేవి



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత



అమ్మవారి ప్రచార రథం ఊరేగింపు ప్రారంభంలో ఆలయ చైర్మన్ చెన్నకేశవరావు, సిబ్బంది

నరసింహారావుపాలెం(వీరులపాడు): నరసింహారావుపాలెంలోని కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాజేష్‌కుమార్ స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత మహిళలు సామూహిక కుంకుమార్చలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల: వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి భక్తులు శుక్రవారం విశేష పూజలు చేశారు.

ఆస్తి కోసం రెండో వివాహం చేసుకోమంటున్నారు

మేనమామపై బాధితురాలి ఫిర్యాదు

జగ్గయ్యపేటఅర్బన్: ఆస్తి కాజేయాలనే కుట్రతో రెండవ వివాహం చేసుకోవాలని బలవంతం చేస్తున్న శరణం మురళీకృష్ణ, వారికి సహకరించిన ఇతర బంధువులపై జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిర్యాదుదారు నందనమూడి భావన సాయి చెప్పిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తన తండ్రి నందనమూడి రవి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ పెద్ద ఎత్తున ఆదాయాన్ని సమకూర్చుకోగలిగారని, 2021లో ఆయన కరోనాతో మరణించారని తెలిపారు. ఆ తరువాత తన తండ్రికి చెందిన ఆస్తుల సమాచారం తెలుసుకుని మేనమామ మురళీకృష్ణ తమ ఆస్తులను కాజేయాలనే కుట్రతో తనను బెదిరించి ఇప్పటికే కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తులను, నగలను, నగదును స్వాహా చేశారని తెలిపారు. మిగిలిన ఆస్తులు కూడా తనకే దక్కాలనే ఆశతో కొన్ని నెలలుగా తనను చిత్రహింసలకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన మేనమామ మురళీకృష్ణకు వివాహమై ఇద్దరు పిల్లలు కలిగి ఉన్నప్పటికీ తన ఆస్తి కోసం తనను రెండవ వివాహం చేసుకోవాలని బలవంతం చేస్తున్నాడని ఆమె ఆరోపించారు. మేనమామ మురళీకృష్ణకు తమ తాతగారైన శివయ్య, అమ్మమ్మ పద్మావతి, రాజేశ్వరి, తోట రామారావు, ఉమా మహేశ్వరి సహకారం అందించి తనను తీవ్ర ఇబ్బందులను గురి చేస్తున్నారని తెలిపారు. వరంగల్ యూనివర్సిటీలో పరీక్షలు రాస్తున్న తనను పేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి తీసుకువచ్చి గృహంలో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసి చంపేందుకు ప్రయత్నం చేయగా పారిపోయి జగ్గయ్యపేటలోని తన బాబాయి మధు ఇంటికి చేరుకుని ప్రాణాలను కాపాడుకోగలిగానని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ బీపీ రామారావు తెలిపారు.

మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ సర్కిల్-1 పరిధిలోగల 39వ డివిజన్‌లోని 117వ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించటంలో భాగంగా నగరంలో మొత్తం 19 కుట్టు మిషన్ ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అందులో ఇది తొలి కేంద్రమని తెలిపారు. పొదుపు సంఘాలకు సున్నా వడ్డీకి రుణాలు, ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా దేశంలో మరెక్కడా లేని విధంగా అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు.

మహిళా సాధికారత, స్వావలంబన కోసం ప్రభుత్వం కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి వారికి ఆర్థిక ప్రయోజనాలను చేకూరుస్తుందన్నారు. అదే విధంగా మహిళలు నిర్వహిస్తున్న వివిధ వ్యాపారాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ మాట్లాడుతూ ఇప్పటికే మహిళల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని తొలిగా తమ డివిజన్‌లో ప్రారంభించటంతో డివిజన్‌లోని పలువురు మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ యూసీడీ విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల, వీఎంసీ సర్కిల్-1 ఇన్‌చార్జ్ సీడీఓ, టెక్నికల్ నిపుణుడు డాక్టర్ ఫణికుమార్, టి.ఇ. రమ్యకృష్ణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ రమ్య, స్థానిక మహిళలు బొండా ఉమాతులసి, ఇజ్జాడ నాగమణి, ఆర్పీలు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.